


సోమవారం 22 జూన్ 2026 పేజీలు : 8

# భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) మండల నూతన కమిటీ సభ్యుల నియామకం

## తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్



**జహీరాబాద్, జూన్ 21(ప్రజా జ్యోతి న్యూస్)**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం ఝరాసంగం మండల భీమ్ ఆర్మీ (భారత్ ఏక్తా మిషన్) నూతన కమిటీ సభ్యుల నియామకం చేయడం జరిగింది. అణగారిన వర్గాల ఆత్మ గౌరవ ప్రతీక డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనలో భాగంగా బోధించు సమీకరించు పోరాడు అనే నినాదాలతో ఇంద్ర ప్రస్థానం భీమ్ ఆర్మీ జహీరాబాద్ ఆఫీస్ నందు నిర్వహించిన సభలో మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర భీమ్ ఆర్మీ చీఫ్ సిద్దు రావణ్ మాట్లాడుతూ... వ్యక్తులను కాదు భావజాలా లను అనుస రించండి భావజాలం ఉన్న వ్యక్తి చైతన్యం చేస్తూనే ఉంటాడు చైతన్య పరుస్తూ నే ఉంటారని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గారి ఆశయ సాధననే తన లక్ష్యంగా భావించి అనుదినం ప్రజలను మేల్కొల్పుతూ రాజ్యాధి కారం దిశగా ప్రజలను చైతన్యవంతులుగా చేస్తూ ప్రజల గొంతుకి తన గొంతుకగా సాగిన అలుపెరుగని ప్రయాణం కొనసాగిస్తున్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు అంబేద్కర్ గారి ఆలోచన విధానాన్ని ముందుకు కొనసాగించాలని జహీరాబాద్ పట్టణంలో నీలి జెండా ఎగరవేయాలని ఆకాంక్షిస్తూ మండలా లలో కమిటీలు వేయడం జరిగింది. ఝరాసంగం మండల ఇంచార్జ్ బి.బాబు కోఆర్డినేటర్ గౌతం కృష్ణ మహిళా వింగ్ కన్వీనర్ సంజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సభను నిర్వహించి విజయ వంతం చేసిన ప్రతి ఒక్క బహుజన బంధువుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

# పటాన్ చెరు లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**హాజరైన వందలాది మంది విద్యార్థులు,**

**వివిధ వర్గాల ప్రజలు, అధికారులు, మాజీ ప్రజా ప్రతినిధులు**

**రెండు గంటల పాటు నిర్విరామంగా యోగా విన్యాసాలు.**

**యోగా విశిష్టతను తెలిపేలా యోగా భంగిమలు.**

**యోగా దినచర్యలో భాగం కావాలి**

**ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా సువర్ణ అవకాశం**

**-ప్రొఫెసర్ జయశంకర్ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకం..**

**-సమాజం నుండి డ్రగ్స్ ను వెలివేయాలి..**

**పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**



# ప్రశాంతంగా జిల్లాలో నీట్ పరీక్షలు నిర్వహణ



**జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్**

**పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్**

**481 అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 423 పరీక్షలకు హాజరు**

**58 మంది అభ్యర్థులు వివిధ కారణాలతో గైర్హాజరు**

**మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్**

మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 21: మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు.

జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ ఆదివారం మెదక్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించగా పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ , సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్ట ప్రణాళిక ద్వారా సమావేశాలు నిర్వహించుకుని వివిధ శాఖల అధికారులకు సూచనలు సలహాలు



అందించడం జరిగిందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా వసతులు కల్పించినట్లు వెల్లడించారు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు అభ్యర్థులను ప్రవేశ ద్వారం వద్ద తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించడం జరిగిందన్నారు పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ యంత్రాంగం 163 బి.ఎన్.ఎస్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి పటిష్ట భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు.

481 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 421 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్టు వివరించారు వివిధ కారణాల వల్ల 58 మంది గైర్హాజర్ కావడం జరిగిందని అన్నారు. నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు చెప్పారు.

# సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధన " యోగ "



యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం

అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్

**మెదక్ (ప్రజాజ్యోతి ) జూన్ 21:** 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు సిబ్బందికి యోగా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కార్యక్రమానికి పతంజలి మహిళ యోగ సమితికి చెందిన యోగా శిక్షకురాలు శ్రీమతి మనోరంజని హాజరై వివిధ యోగా ఆసనాలు, ప్రాణా యామాలను చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ హాజరై 12 వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం. శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధన యోగ. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయి. నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరం" అని అన్నారు. ముఖ్యంగా పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, అలసటను అధిగ మించేందుకు యోగా ఎంతో ఉపయోగపడు



తుందని, అందరూ నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యోగా శిక్షణ అందించిన పతంజలి మహిళ యోగ సమితి ప్రతినిధి శ్రీమతి మనోరంజని కి అదనపు ఎస్పీ అభి నందనలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సిఐ లు కృష్ణ మూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, రామ కృష్ణ, ఎసై లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం.

యోగాతో శరీరక ,మానసిక ప్రశాంతత



**అల్లాదుర్గం జూన్ 21 (ప్రజాజ్యోతి)** అల్లాదుర్గం.. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (గ్రా.నూ) ముస్లాపూర్ లో యోగ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో యోగ మాస్టర్ సంతోష్ కుమార్ , యోగ ట్రైనర్ శ్రీమతి ఉజ్వల శ్రీభారతి లు మాట్లాడుతూ ప్రతిరోజు యోగా చేయడం ద్వారా ఎటువంటి అనారోగ్య సమస్యలు రావని అన్నారు. 30 నిమిషాలు యోగాకు సమయం కేటాయించడం ద్వారా వందేళ్ల ఆరోగ్యంగా జీవించే ఆస్కారం ఉందని పేర్కొన్నారు. మనిషి శరీరక మానసిక ప్రశాంతతకు యోగ తప్పనిసరి అవసరమని ఈ సందర్భంగా విద్యార్థులకు యోగ యొక్క ప్రత్యేకత, వివిధ ఆసనాలు చేసే విధానం, యోగ వల్ల కలిగే శారీరక మరియు మానసిక ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అల్లాదుర్గం సబ్-ఇన్స్పెక్టర్ శంకర్ గారు మాట్లాడుతూ, యోగ చేయడం వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని, విద్యార్థులు ప్రతిరోజూ యోగ సాధన చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. రమేష్ , కరాటే మాస్టర్ మల్లేశం గారు, జనార్ధన్, దేవానంద్, సంతోష్, గురుచరణం, యాదయ్య మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## వాగులో పడి వ్యక్తి మృతి

**అల్లాదుర్గం జూన్ 21 (ప్రజాజ్యోతి)** అల్లాదుర్గం.. వాగులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని చిల్వర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అల్లాదుర్గం మండల పరిధిలోని చిల్వర్ గ్రామానికి చెందిన మ్యాదరి బేతయ్య ( 56) గత కొన్నాళ్లుగా ఒంటరిగా జీవిస్తున్నాడు., తన భార్య కొన్ని సంవత్సరాల క్రితం చనిపోవడంతో మద్యానికి



బానిసై అటు ఇటు తిరిగేవాడిని తెలిపారు. గత మూడు రోజుల క్రితం ఇంటి నుండి వెళ్లి తిరిగి రాలేదని తన కూతురు బాబాయ్ కి తెలుపగా ఎక్కడ తాగి పడుకున్నాడని భావించారన్నారు. ఆదివారం గ్రామ సమీపంలోని హుస్సేన్ వాగులో శవమై తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శంకర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని వాగు నుండి శవాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కూతురు మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శంకర్ తెలిపారు

# జొన్నల కొనుగోలు ప్రక్రియలో జాప్యం

అధికారుల అలసత్వం

కొనుగోళ్లు వేగవంతం చేయాలని డిమాండ్

**అల్లాదుర్గం జూన్ 21 (ప్రజాజ్యోతి) :** అల్లాదుర్గం మండలంలోని చిల్వర్ గ్రామంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు ప్రక్రియలో అధికారులు జాప్యం వహిస్తున్నారని రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల నుండి జొన్నలను వెనువెంటనే కొనుగోలు చేయకపోవడంతో రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. రైతు ఆరుగాలం పంట ను పండించేందుకు పలు రకాలుగా ప్రయత్నించిన, తరువాత చేతికి వచ్చిన పంటను ప్రభుత్వానికి అమ్ముకుందామంటే అధికారులు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. ముప్పారం గ్రామానికి చెందిన రైతులు సొసైటీ అధికారులను నిలదీశారు. వర్షానికి జొన్నలు తడిసిపోతాయేమో అనే భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా జిల్లా స్థాయి అధికారులు వెంటనే స్పందించి నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై చర్యలు తీసుకుని, జొన్నల కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో





తీవ్ర ఆందోళన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని రైతులు డిమాండ్ చేశారు.

# ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

ఏకాగ్రత ఆరోగ్యవంతమైన జీవనం

మండల విద్యాధికారి మధుమోహన్

హవెలి ఘనపూర్ (ప్రజాజ్యోతి ) జూన్ 21: అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం రోజు హవేలీ ఘనపూర్ మండల పరిధిలోని. పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కూచన్ పల్లి లలో ఘనముగా యోగ దినోత్స వాన్ని నిర్వహించారు. యోగ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్థానిక మండల విద్యాధికారి నాచారం మధుమోహన్ విద్యార్థులు తో కలిసి యోగా చేసి ,విద్యార్థులకు యోగా ప్రాముఖ్యతను గురించి వివరించారు. ఈ సందర్భంగా. ఎన్ .మధుమోహన్ మాట్లాడుతూ యోగా చేయడం వల్ల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత కూడా లభిస్తుందని తెలిపారు. ప్రతిరోజు యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడి తగ్గి ఏకాగ్రత పెరిగి. ఆరోగ్యవంతమైన జీవనం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిరోజు కొంత సమయం యోగకు కేటాయించాలని ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం లో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుల వినోద్ సీనియర్ ఉపాధ్యాయులు శివరాజ్ , పంతంగి శ్రీనివాస్. త్యార్ల శ్రీనివాస్, , ఎల్ . మల్లారెడ్డి శశికుమార్, శశి కుమార్ రెడ్డి, రాజేందర్ రెడ్డి.తదితరులు ఉన్నారు.






# ఓటర్ల జాబితా ప్రక్షాళనకు కాంగ్రెస్ కసరత్తు

'సర్' పై బూత్ లెవెల్ ఏజెంట్లకు మంత్రి దామోదర్ రాజనర్సింహ దిశానిర్దేశం

అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకూడదని సూచన



**అందోలు, జూన్ 21 (ప్రజాజ్యోతి):** ఎన్నికల వ్యవస్థను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమంపై అందోల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సంగారెడ్డిలోని తన నివాసంలో అందోల్, వట్పల్లి, పుల్కల్, చౌటకూరు మండలాలకు చెందిన బూత్ లెవెల్ ఏజెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరుగా నమోదు కావడం ఎంతో ముఖ్యమని అన్నారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో పనిచేసే బూత్ లెవెల్ ఏజెంట్లు ఇంటింటికీ వెళ్లి అర్హులైన ఓటర్లను గుర్తించి జాబితాలో చేర్చేలా కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాలో ఉన్న లోపాలను సరిదిద్దడం, చిరునామా మార్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి వివరించారు. అదే సమయంలో అర్హులైన ఓటర్లు పొరపాటున జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని బీఎల్ఏలకు సూచించారు.



**బీఎల్ఏల పాత్ర కీలకం**

ఎన్నికల సంఘం చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు ఓటరు నమోదు, సవరణల విషయంలో వారికి సహకరించాలని సూచించారు. ప్రతి ఏజెంట్ 'సర్' నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ప్రజలకు కూడా వాటిని స్పష్టంగా వివరించాలని కోరారు.

**ప్రజాస్వామ్య బలోపేతానికి చర్యలు**

పారదర్శకమైన ఓటర్ల జాబితా ప్రజాస్వామ్య బలోపేతానికి దోహదపడుతుందని మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ దిశగా పార్టీ శ్రేణులు, బూత్ లెవెల్ ఏజెంట్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అందోల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, బూత్ లెవెల్ ఏజెంట్లు, కార్యకర్తలు పాల్గొని 'సర్' కార్యక్రమంపై అవగాహన పొందారు. సమావేశంలో ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియ, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు.

## చావు లేని వాదం.. చెరగని జ్ఞాపకం

-బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప

- టేక్మాల్ లో తెలంగాణ సిద్ధాంతకర్తకు కన్నీటి నివాళి



**టేక్మాల్ (ప్రజాజ్యోతి) జూన్ 21:** ప్రొఫెసర్ జయశంకర్ 15వ వర్ధంతి సందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో టేక్మాల్ చౌరస్తాలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ సార్ విగ్రహానికి పూలమాలలు వేసి బిఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నివాళులర్పించారు. "జై తెలంగాణ" నినాదాలతో మార్మోగిన మండల కేంద్రం తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాన్ని త్యాగం చేసిన తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ఆచార్య కొత్తపల్లి జయశంకర్ సార్ 15వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.టేక్మాల్ చౌరస్తాలో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. "జై తెలంగాణ నినాదాలతో చౌరస్తా మార్మోగింది. జయశంకర్ సార్ విగ్రహం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. "సార్ లేకపోతే తెలంగాణ లేదు. ఆయన వేసిన బాటలోనే కేసీఆర్ నడిచి రాష్ట్రం సాధించారు" అంటూ కార్యకర్తలు గుర్తు చేసుకున్నారు. మండల అధ్యక్షులు భక్తుల వీరప్ప మాట్లాడుతూ.. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ కోసం పోరాడిన మహానుభావుడు జయశంకర్ సార్ ఇప్పుడు ఆయన కలలు కన్న బంగారు తెలంగాణ నిర్మించడం మన బాధ్యత అదే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి" అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సిద్దయ్య, జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, ఎంఎ సలీం,రవి, సత్యనారాయణ, సాయిబాబా, మాణిక్యం, శ్రీనివాస్, అనిల్, శ్రీశైలం, లక్ష్మణ్, నాగయ్య, రమేష్, సాయిలు, కిష్టయ్య, రెహమాన్, జమీల్ తదితరులు పాల్గొన్నారు.

## విజేత హైస్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూన్ 21:** అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణఖేడ్ పట్టణంలోని విజేత హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ యోగాసనాలను ప్రదర్శించి, యోగ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. ప్రతిరోజూ యోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని, ఏకాగ్రత పెరిగి ఒత్తిడి తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి యోగాసనాలు నిర్వహించి యోగ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం యోగ దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పటాన్ చెరు లో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు





**పటాన్ చెరు(ప్రజాజ్యోతి)**

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని మైత్రి మైదానంలో నిర్వహించిన యోగా దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. వందలాది మందితో కలిసి సామూహిక యోగా కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం 6:30 నుండి 09:00 గంటల వరకు పతాంజలి యోగ సమితి శిక్షకుల సౌజన్యంతో రెండున్నర గంటల పాటు వివిధ రకాల యోగా భంగిమలు ప్రదర్శిస్తూ.. ప్రతి ఒక్కరిని భాగస్వాములు అయ్యేలా కార్యక్రమాన్ని నిర్వహించారు. యోగ ప్రాముఖ్యతను తమ ఆసనాల ద్వారా వివరిస్తూ సంపూర్ణమైన ఆరోగ్య జీవనశైలికి యోగ ఏ విధంగా ఉపయోగపడుతుందో వివరించారు. ఈ సందర్భంగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మనిషి తన ఆరోగ్యం పై దృష్టి పెట్టకపోవడం మూలంగా మానసిక, శారీరక సమస్యలతో నిరంతరం బాధపడుతూ అనారోగ్యకరమైన జీవితాలను కొనసాగిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని నియోజకవర్గంలోని ప్రజలకు యోగ ప్రాముఖ్యతను తెలియజేయాలన్న సమున్నత లక్ష్యంతో.. గత రెండు సంవత్సరాల నుండి మైత్రి మైదానంలో యోగ దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మనిషి నిత్యం ఎదుర్కొనే మానసిక, ఆరోగ్య సమస్యలకు సర్వరోగ నివారిని యోగ అని అన్నారు. యోగాకు కులం మతం ప్రాంతం జాతి లేదని, ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగమని తెలిపారు. యావత్తు ప్రపంచానికి భారతదేశం అందించిన మహోన్నత సాధనం యోగ అని అన్నారు. విద్యార్థి దశ నుండే మత్తు పదార్థాల వినియోగం, వాటి దుష్ఫలితాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుత సమాజంలో డ్రగ్స్ కల్చర్ ఎక్కువగా కొనసాగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పౌరుడు తన బాధ్యతగా డ్రగ్స్ కి వ్యతిరేకంగా పోరాటం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తే వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

**తెలంగాణ జాతిపిత ప్రొఫెసర్ జయశంకర్..**

తొలిమలి దశ తెలంగాణ పోరాటంలో కీలకపాత్ర పోషించడంతోపాటు.. ప్రత్యేక తెలంగాణ సాధనకు తన జీవితాన్ని త్యాగం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని మైత్రి మైదానంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐశ్వర్య నృత్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన నృత్య ప్రదర్శన అందర్నీ అలరించింది.

అనంతరం వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర జాతీయ స్థాయిలో అద్భుత ప్రతిభగల పరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమాల్లో పటాన్ చెరు సిఐ వినాయక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ లు శంకర్ యాదవ్, మెట్టు కుమార్ యాదవ్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, పతంజలి యోగాసమితి రాష్ట్ర అధ్యక్షులు పస్పరి శివుడు, నర్సింలు, సంజీవ రెడ్డి, మురళి, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, శ్రీధర్ చారి, పృథ్వీరాజ్, మైత్రి క్లబ్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, పరమేష్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల కరస్పాండెంట్లు, యోగా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలి

### - కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాహేర్ అలీ



**నారాయణఖేడ్, ప్రజాజ్యోతి జూన్ 21:** ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో భాగంగా జూన్ 25 నుంచి బూత్ లెవల్ అధికారులు (బి.ఎల్.ఓలు) ప్రతి ఇంటికి వచ్చి ఓటర్ల వివరాలను సేకరిస్తారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తాహేర్ అలీ అన్నారు. ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ..బి.ఎల్.ఓలు ఇంటికి వచ్చినప్పుడు ఓటర్ ఐడి కార్డు, ఇటీవల తీసుకున్న రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటో, ఇప్పటికే అందించిన మ్యాపింగ్ వివరాలు, జన్మతేదీ (తెలిసి ఉంటే), ఆధార్ కార్డు (తప్పనిసరి కాదు) వంటి పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. తండ్రి, తల్లి, తాతలు, అమ్మమ్మలు, నానమ్మలు తదితర కుటుంబ సభ్యుల 2002 నాటి వివరాలను కూడా అందుబాటులో ఉంచితే ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందన్నారు. అన్ని వివరాలు అందించిన అనంతరం బి.ఎల్.ఓలు రెండు ఫారాలను నింపించి, ఒక ఫారాన్ని రసీదు (రిసీప్ట్ కాపీ)గా అందజేస్తారని, ఆ రసీదును తప్పనిసరిగా తీసుకోవాలని ఆయన సూచించారు. రసీదు పొందిన తర్వాతే ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పూర్తయినట్లుగా పరిగణిస్తారని తెలిపారు. ప్రజలందరూ ఈ ప్రక్రియలో చురుకుగా పాల్గొని అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## కోర్టు ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవం

### సీనియర్ సివిల్ జడ్జి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవిత దేవి






**జహీరాబాద్, జూన్ 21(ప్రజా జ్యోతి న్యూస్)** మండల లీగల్ సర్వీసెస్ కమిటీ వారి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఆవరణలో సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ కవిత దేవి మరియు అదనపు జూనియర్ సివిల్ జడ్జి బ్లెస్సి, కోర్టు సిబ్బంది మరియు న్యాయవాదులతో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్సవంను జరుపు కున్నారు. న్యాయమూర్తులు మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యాన్ని అందరు కాపాడుకో వాలని అన్నారు. యోగా వలన ఆరోగ్యంతో పాటు మానసిక వొత్తిడి తగ్గుదల సాధ్యమవు తుందని అన్నారు. ప్రతిఒక్కరు తప్పకుండ ప్రతిరోజు యోగా చేయాలని సూచించారు. అందరు యోగాసనాలు చేసారు. ఈ కార్యక్రమంలో ఏజిపి దత్రాత్రేయ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు గోపాల్, మానెన్న, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నీట్-యూజీ 2026 పరీక్ష దృష్ట్యా జిల్లా వ్యాప్తంగా

# అన్ని పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు.






పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్.

**సంగారెడ్డి ప్రజా జ్యోతి:** నిర్వహించబడుతున్న నీట్-యూజీ 2026 పరీక్ష సందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాల, సంగారెడ్డి; కేంద్రీయ విద్యాలయం (ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలుర); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సంగారెడ్డి (బాలికల); జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోతిరెడ్డిపల్లి; ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల; ప్రభుత్వ మహిళల జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. మధ్యాహ్నం 2:00 గంటల నుండి సాయంత్రం 5:15 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుందని, పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లో జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లను తెరవడానికి అనుమతి లేదని తెలిపారు. అలాగే సెక్షన్-163 బీఎన్ఎస్ఎస్ (సెక్షన్-144 సీఆర్పీసీ) అమల్లో ఉంటుందని, గుంపులు గుంపులుగా తిరగడం నిషేధమని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటాయని, ఎలాంటి కమ్యూనికేషన్ సిగ్నల్స్ అందకుండా జామర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. తప్పుడు వార్తలు, వదంతులు (రూమర్స్) ప్రచారం చేసి పరీక్షల ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు కార్యాలయం ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని అన్నారు. వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే తప్పుడు వార్తలు, నిర్ధారణ లేని ఫార్వర్డ్ సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తప్పుడు సందేశాలను వ్యాప్తి చేస్తే సంబంధిత వ్యక్తులతో పాటు గ్రూప్ అడ్మిన్లు కూడా బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

## తాండూర్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

**తాండూర్ :** అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను ఆదివారం మంచిర్యాల జిల్లా తాండూర్ మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. మాదారం పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో తాండూర్ మండల వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో, తాండూర్ పీహెచ్‌సీ ఆయష్ దవాఖానలో డాక్టర్ సౌజన్య ఆధ్వర్యంలో సామూహిక యోగా సాధన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాయామాలు, ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం వాటి ప్రయోజనాలు గురించి యోగా శిక్షకులు, పీఈటీ తొగరి శ్రీనివాస్, ఉప్పుట్ల చందు అవగాహన కల్పించి కొన్ని ముఖ్యమైన ఆసనాలను కార్యక్రమానికి హాజరైన వారితో వేయించారు. యోగా సాదనతో అనేక శారీరక రుగ్మతలు దూరం కావడంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని అన్నారు. నిత్యం యోగా సాధనతో మన శరీరంలోని అవయవాలన్నీ సక్రమంగా పని చేసి వ్యాదులను దూరం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, తాండూర్ మండల వాకర్స్ క్లబ్ సభ్యులు, యోగా సాధకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## వానలు కురవాలని హిమ్మత్‌నగర్‌లో కప్పతల్లి ఆడిన గ్రామస్తులు

**వీణవంక :** వీణవంక మండలంలోని హిమ్మత్‌నగర్ గ్రామంలో ఆదివారం వానలు కురవాలని కోరుతూ సర్పంచ్ జడల శ్రీకాంత్‌తో పాటు పాలకవర్గ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్దలు అందరూ కలిసి కప్పతల్లి ఆట ఆడి, ప్రత్యేక పూజలు చేశారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, పురుషులు బిందెలతో నీళ్లు ఎత్తుకొని గ్రామంలోని బొడ్రాయి, హనుమాన్, పోచమ్మతల్లి దేవాలయాల్లో విగ్రహాలకు నీళ్లు పోసి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సాగుకాలం దాటిపోతున్నా వర్షాలు కురవకపోవడంతో వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ గ్రామంలో కప్పతల్లి ఆడి, గ్రామంలోని దేవతలందరికీ ప్రత్యేక పూజలు చేసినట్లు చెప్పారు. ఈ

# యూరియా యాప్‌ను రద్దు చేయాల్సిందే..

## రైతు బంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి

**బాన్సువాడ :** యూరియా యాప్ పేరుతో రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోందని, తక్షణమే యూరియా యాప్ ను ఎత్తివేసి పాత పద్ధతిలోనే రైతులకు యూరియాను సరఫరా చేయాలని రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు దుద్దాల అంజిరెడ్డి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాన్సువాడ మండలంలోని సోమేశ్వర్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో యూరియా పంపిణీ చేయడంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఎన్నికల్లో మోస పూరితమైన హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి, అధికారంలోకి వచ్చాక రైతులను విస్మరిస్తున్నారని దుయ్యబట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో రైతులకు సరిపడ యూరియా పుష్కలంగా లభించిదని అన్నారు. కాంగ్రెస్ పాలనలో యూరియా కోసం రైతులు చెప్పులు లైన్లో పెట్టే పరిస్థితి దాపురించిందని అన్నారు. వ్యవసాయ సలహాదారుడిగా ఉన్న పోచారం శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్‌గా ఉన్న కాసుల బాల్ రాజ్ ప్రభుత్వానికి ఎం సలహాలు ఇస్తున్నారని ప్రశ్నించారు. యాప్ వల్ల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా ఇక్కడి నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని అన్నారు. రైతులకు రావాల్సిన మూడు విడతల రైతు బరోసా నిధులను ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి సర్కారు రైతులకు క్షమాపనలు చెప్పాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతులను రాజుగా చేయడమే లక్ష్యంగా గత సీఎం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తే ఇప్పటి సీఎం రేవంత్‌రెడ్డి రైతుల నడ్డి విరిచే పథకాలను అమలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. గతంలో నిజాంసాగర్లో లో నీళ్లు లేక రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతుంటే కాళేశ్వరం నీటిని నిజాంసాగర్లోకి తీసుకొచ్చి నిజాంసాగర్ ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగు నీరు అందించిన ఘనత కేసీఆర్ కే దక్కిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికై ఇచ్చిన ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, యూరియా యాప్ ను ఎత్తేసి, పాత పద్దతిలోనే రైతులకు యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించిన ధాన్యానికి కొర్రీలు పెట్టకుండా అన్ని రకాల వరి పంటలకు బోనస్ ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నాయిని మొగులయ్య, బోడ రామచందర్, గులేపల్లి మొగులయ్య, మన్నే అనిల్, సాయిబాబా, లక్ష్మణ్, భరత్, షరీఫ్, ఎల్లయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

